సాక్షి
మంచిర్యాల
బుధవారం। 18। అక్టోబర్। 2023



బెంగాలీలే నిర్ణేతలు!
సిర్పూర్ నియోజకవర్గాన్ని స్థానికులు మినీ ఇండియాగా పిలుచుకుంటారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినవారే ఇక్కడి ఎన్నికల్లో కీలకంగా మారుతారు. 10లో▸



హరప్పాకు అమెరికన్ల బైక్ రైడ్
జన్నారం: పది మంది అమెరికా బైక్ రైడర్లు హైదరాబాద్ నుంచి మంగళవారం జన్నారం చేరుకుని హరిత రిసార్ట్‌లో సేదదీరారు. హరప్పా ఆలయానికి వెళ్లనున్నట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటరు అవగాహన వాహనం ప్రారంభం


వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా ఓటరు అవగాహన వాహనాన్ని కలెక్టర్ సంతోష్ మంగళవారం డీఆర్డీవో శేషాద్రితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు వినియోగం ద్వారా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని సూచించారు. కళాజాత బృందంతో జిల్లా ప్రజలను చైతన్య పరిచి 100 శాతం పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 30వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

కోర్టు ఆవరణలో బతుకమ్మ సంబరాలు


ఆడుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు బతుకమ్మ ఆడి, పాడి సందడి చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఉదయ్‌కుమార్, అర్పిత మారంరెడ్డి, ఉపనిషద్వని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, ఉపాధ్యక్షుడు టీ అనిల్‌రాజ్, ప్రధాన కార్యదర్శి రంగు మల్లేశ్, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం కొనసాగాయి. పదోతరగతి పరీక్షలకు 48 మందికి 35 మంది హాజరుకాగా 13 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 125 మందికి 88 మంది హాజరయ్యారు. 37మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

'నియమావళిపై అవగాహన అవసరం'

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బీ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు, చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తుతో కలిసి మాస్టర్ ట్రైనర్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు సరిపడా సిబ్బందిని నియమించామని, ఖర్చుల పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. అదనపు సిబ్బందితో కలిసి 97 సెక్టార్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. పశు సంవర్ధశాఖ అధికారి రమేశ్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరు బరిలో కామ్రేడ్లు

కాంగ్రెస్-సీపీఐ అభ్యర్థి రేగుంట చంద్రశేఖర్



- కాంగ్రెస్-సీపీఐ ఉమ్మడి అభ్యర్థిగా రేగుంట
- పార్టీలో చర్చల తర్వాత పోటీకి నిర్ణయం
- 'హస్తం' ఆశావహులకు ఊహించని షాక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్-సీపీఐ పొత్తులో చెన్నూరు స్థానాన్ని సీపీఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) కేటాయించడంతో అక్కడ పోటీకి కామ్రేడ్లు సై అంటున్నారు. మొదట బెల్లంపల్లి సీటుపై ఆశలు పెట్టుకుంటే అక్కడ కాదని చెన్నూరు ఇవ్వడంపై ఒకింత ఆందోళన చెందారు. అయితే రాష్ట్రస్థాయిలో పొత్తులో తమకు ఇచ్చిన సీటు ఎందుకు వదులుకోవాలనే కోణంలో చివరికి పోటీకి సిద్ధపడ్డారు. రెండు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా నస్పూర్ మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్‌ను సీపీఐ బరిలో దింపనుంది. బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన అక్కడ పోటీ చేసేందుకు తీవ్రంగా యత్నించినా కుదరలేదు. దీంతో ఆయనను చెన్నూరు నుంచి పోటీలో దింపేందుకు పార్టీలో అంగీకారం కుదిరింది. మాదిగ సామాజిక వర్గానికి చెందిన చంద్రశేఖర్ స్వస్థలం జైపూర్ మండలం గుత్తదారుపల్లి. ప్రజానాట్యమండలిలో కళాకారుడిగా పని చేసిన ఆయన ప్రస్తుతం సింగరేణి ఉద్యోగి ఉన్నారు.

తెరపైకి మాదిగ అభ్యర్థిత్వం

చెన్నూరు నియోజకవర్గంలో మాదిగ ఓట్లు అధికంగా ఉన్న నేపథ్యంలో తమకు కలిసొచ్చే అంశంగా కామ్రేడ్లు చెబుతున్నారు. జిల్లాలో ఆయా పార్టీలు మాదిగలకు టికెట్ ఇవ్వకపోవడం, ఇక్కడ ఉమ్మడి అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన చంద్రశేఖర్‌ను తెరపైకి తీసుకువస్తున్నారు. ఇక పార్టీ పరంగా చూస్తే మందమర్రి, రామకృష్ణాపూర్ పరిధిలో సింగరేణి కార్మికులు సీపీఐ అనుబంధ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, కార్మిక అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ ఓట్లు రాబట్టొచ్చని ఆశిస్తున్నారు. సింగరేణి గత గుర్తింపు ఎన్నికల్లో మందమర్రి ఏరియాలో ఏఐటీయూసీ గెలుపొందింది. మిగతా చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్‌లో ఎర్ర జెండా పార్టీకి బలం లేనప్పటికీ పూర్తిగా కాంగ్రెస్ ఓట్లు, బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లపై ఆధారపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఎర్రజెండా నాయకులు ఈ ఎన్నికను ఎలా ఎదుర్కొంటారనే ఆసక్తి నెలకొంది.

నాయకులు 'చేయి' కలిపేనా?

పొత్తులో భాగంగా కాంగ్రెస్ అధిష్టానం చెన్నూర్‌ను సీపీఐకి కేటాయిస్తుందని కలలో కూడా ఊహించని హస్తం నేతలు ఉమ్మడి అభ్యర్థి గెలుపుకోసం చేయి కలిపి పని చేస్తారా? అనేది సంశయంగా మారింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి బోడ జనార్దన్‌తోపాటు మరో 13మంది టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనూహ్యంగా పొత్తులో సీపీఐకి సీటు కేటాయించడంలో వీరంతా ఏం చేస్తారనేది ఆసక్తిగా మారింది. అయితే ఇప్పటికీ ఆశావహులు కాంగ్రెస్‌కే టికెట్ కేటాయించాలని పట్టుబడుతున్నారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో నిరసనలు చేపడుతున్నారు. కొందరు రాష్ట్ర స్థాయి నాయకులతో పైరవీ చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రన్నలతో కలిసివస్తారా? అనేది ఆసక్తిగా మారింది. అయితే పొత్తు ధర్మంలో భాగంగా కచ్చితంగా తమతో కలిసి వస్తారని సీపీఐ నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాము మద్దతు తెలుపుతున్న క్రమంలో ఇక్కడ కూడా ఆ పార్టీ నాయకులు తమతో కలిసి పని చేస్తారనే ధీమాతో ఉన్నారు. అయితే ఎలాగైనా పోటీ చేసేందుకు సిద్ధపడిన కాంగ్రెస్ ఆశావహులు చివరికి పార్టీని వీడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

ఇంటి నుంచే ఓటు


జిల్లా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు (ఫైల్)

- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- దివ్యాంగులు, 80ఏళ్లు దాటిన వారికే అవకాశం
- ఫాం-12డీతో దరఖాస్తుకు అవకాశం

మంచిర్యాలటౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవసరమైన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 80ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ఫారం 12డీని ఆయా ఓటర్లకు అందిస్తోంది. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. అధికారులు ఇందుకు సంబంధించి ఫారం 12డీని అర్హులైన ఓటర్లకు అందించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలకు ఒక్క రోజు ముందుగానే వారి ఇళ్లకు వెళ్లి ఓటు వేయిస్తారు. దీంతో 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు రాకుండానే ఓటు హక్కు వినియోగించుకుంటారు. గత ఎన్నికల వరకు దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. కానీ.. వారిని తీసుకువచ్చి ఓటు వేయించడం సహాయకులకు కష్టంగా ఉండడం, కొందరు ఓటు వేసేందుకు ఇష్టపడక పోవడం వంటి కారణాలతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు 3,09,229 మంది ఉండగా, పురుష ఓటర్లు 3,08,630 మంది, ట్రాన్స్‌జెండర్లు 42 మంది ఉన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో 2,64,186 మంది, బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,69,598 మంది, చెన్నూరు నియోజకవర్గంలో 1,84,117 మంది ఓటర్లున్నారు.

దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధుల వివరాలు

నియోజకవర్గం	దివ్యాంగులు	వృద్ధులు
మంచిర్యాల	10,192	3,077
బెల్లంపల్లి	2,675	2,102
చెన్నూర్	3,147	2,433

దరఖాస్తు చేసుకుంటేనే..
ఇంటినుంచి ఓటు వేయాలనుకునే 40శాతానికి మించి వైకల్యమున్న దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ఆరురోజుల ముందు వరకు ఫారం 12డీలను బీఎల్వోల ద్వారా అందిస్తారు. వారి ద్వారా దరఖాస్తులు స్వీకరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేస్తున్నారు. వీటి ఆధారంగానే వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు వేసేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకవేళ దివ్యాంగులు, వృద్ధులు నేరుగా పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటే వీరికి అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉంచుతారు. ఫారం 12డీ ద్వారా ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు ఒక్కరోజు ముందుగానే అధికారులు చేరుకుంటారు. ఓటరు తన ఓటు బ్యాలెట్ బాక్సులో వేసేలా చర్యలు తీసుకుంటారు.

ఇంటింటా అభివృద్ధిని వివరించాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్


మాట్లాడుతున్న విప్ సుమన్

రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు ప్రతి గడపకూ చేరేలా పార్టీ సోషల్ మీడియా వారియర్స్ విస్తృత ప్రచారం చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. క్యాతనపల్లిలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం బీఆర్ఎస్ సోషల్‌మీడియా వారియర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధిపై రూపొందించిన మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఎన్నికల ప్రచార పాటల సీడీలు, ప్రచార రథాలను ప్రారంభించారు. కాగా, నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు యువకులు వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరగా విప్ కండువా కప్పి ఆహ్వానించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, సరోత్తంరెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల ఖర్చుకు 'రుణమాఫీ' విరాళం


సుమన్‌కు నగదు ఇస్తున్న దామోదర్‌రెడ్డి

చెన్నూర్: క్యాతన్‌పల్లి ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఎన్నికల ఖర్చు కోసం తన రూ.51వేల రుణమాఫీ డబ్బులు అందజేసినట్లు చెన్నూర్ ఏఎంసీ చైర్మన్ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తనకు రూ.లక్ష రుణమాఫీ చేసిందని, ఇందులో సగాన్ని ఎన్నికల ఖర్చు కోసం అందజేసినట్లు చెప్పారు. పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, జెడ్పీటీసీ సభ్యుడు మోతె తిరుపతి, చెన్నూర్ వైస్ ఎంపీపీ ఎన్నపురెడ్డి బాపురెడ్డి, కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పకడ్బందీ తనిఖీలు చేపట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

కోటపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో పకడ్బందీ తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మంగళవారం రాపన్‌పల్లి ప్రాణహిత నదిపై ఏర్పాటు చేసిన మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టును అదనపు కలెక్టర్ మోతీలాల్, రాహుల్‌తో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. నగదు, మద్యం, రవాణా చేస్తే వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేయాలని సూచించారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్తూ ఆధారాలు చూపకుంటే డబ్బు స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినవారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్వో సిడాం దత్తు, తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారుబడుల్లో వృత్తివిద్య కోర్సులు

- విద్యార్థులకు స్వయం ఉపాధి

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో నైపుణ్యానికి పదును పెట్టించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బడుల్లో నూతన హంగులు సమకూర్చాలనే లక్ష్యంతో పీఎంశ్రీ పథకం అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగానే ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో ఉపాధి చదువు (వృత్తివిద్య) అందించాలని నిర్ణయించింది. పదో తరగతి వరకున్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు నేర్పిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్-1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా ఒక వృత్తివిద్య నేర్చుకోవాలని మానసికంగా సిద్ధం చేస్తారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తారు. పదోతరగతి వార్షిక పరీక్షలు ముగిసేనాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా శిక్షణ ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేయనున్నారు.

తొమ్మిది పాఠశాలల్లో..
పదోతరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి కల్పించే జనాదరణ పొందిన కోర్సులు అందించాలని నిపుణులు సూచించారు. ఇందుకు ప్రత్యేక అవసరమున్న బోధకులను నియమించనున్నారు. జిల్లాలో ఇప్పటికే ఐదు మోడల్ స్కూళ్లలో ప్రవేశపెట్టగా మరో తొమ్మిది పాఠశాలల్లో స్వయం ఉపాధి కోర్సులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేందుకు వీలున్న 19 రకాల కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ప్రతీ పాఠశాల నుంచి అందులో ఏవైనా రెండు కోర్సులు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. పాఠ్యాంశాల బోధనతో పాటు ప్రయోగాలు కూడా నిర్వహిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సుల్లో క్షేత్రసందర్శన ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులు ఎంపిక చేయాల్సి ఉంటుంది.

ఎంపికైన పాఠశాలలివే..
వృత్తివిద్య కోర్సులు ప్రవేశపెట్టేందుకు జిల్లాలో తొమ్మిది పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో జెడ్పీహెచ్ఎస్ తీగలపహాడ్, జెడ్పీహెచ్ఎస్ దండేపల్లి, జెడ్పీహెచ్ఎస్ రేచిని, జెడ్పీహెచ్ఎస్ దేవులవాడ, జెడ్పీహెచ్ఎస్ నీల్వాయి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెన్నూర్, టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ బాయ్స్ బెల్లంపల్లి, తాళ్లగురిజాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ లక్సెట్టిపేట్ పాఠశాలలున్నాయి.

వృత్తివిద్యకు ప్రాధాన్యమివ్వాలి
వృత్తివిద్యకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథ సంచాలకుడు జీ రమేశ్ సూచించారు. మంగళవారం వృత్తివిద్య కోర్సుల అమలుపై జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో రెండు ట్రేడ్లు ఎంపిక చేసుకుని నాణ్యమైన శిక్షణ ఇప్పించడంతో పాటు పాఠశాల, ఇంటర్ విద్య పూర్తయ్యేసరికి విద్యాసామర్థ్యాలతో పాటు వృత్తివిద్య సామర్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందించటానికి కృషి చేయాలన్నారు. విద్యార్థిదశలో ఉండగానే గత వృత్తి నైపుణ్యాల ద్వారా సొంతంగా సంపాదించుకునేలా తీర్చిదిద్దే అవకాశాన్ని అందించాలని సూచించారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు సత్యానారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్
- పలు పోలింగ్ స్టేషన్ల పరిశీలన


కాసిపేట: స్థానికులతో మాట్లాడుతున్న డీసీపీ రామ్‌నాథ్ కేకన్

భీమిని: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ సూచించారు. మంగళవారం మండలంలోని ఖర్జీభీంపూర్, కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీల పరిధి పోలింగ్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఖర్జీభీంపూర్‌లో పోశమ్మ గుడికి వెళ్లేదారి గుంతలమయంగా మారిందని గ్రామస్తులు డీసీపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. దారికి మరమ్మతు చేయించాలని ఎస్సైని ఆదేశించారు. యువత చెడుమార్గంలో వెళ్లకుండా చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు ప్రశాంత్, నరేశ్ తదితరులున్నారు.

కాసిపేట మండలంలో..
కాసిపేట: మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సోనాపూర్, సాలెగూడ, వెంకటపూర్ పోలింగ్‌స్టేషన్లను డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. స్థానిక పరిస్థితులు తెలుసుకున్నారు. ఎలాంటి గొడవలకు తావివ్వవద్దని, అసాంఘిక శక్తుల సమాచారం ఉంటే తమకు తెలుపాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్‌శాఖ పని చేస్తుందని తెలిపారు. ఎలాంటి గొడవలు సృష్టించినా నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీసీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

రోజ్‌గార్డెన్‌లో పార్క్‌కు కళ


మల్చింగ్ విధానంలో నాటిన గులాబీ మొక్కలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉద్యానవన కేంద్రంలో రెండు దశాబ్దాల కిందటివరకు ప్రసిద్ధిగాంచిన రోజ్‌గార్డెన్ పర్యవేక్షణ లేక కనిపించకుండా పోయింది. ఇందులోని గులాబీ మొక్కలు ఎండిపోయాయి. ఇక్కడి రోజ్ గార్డెన్ ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. శుభకార్యాలకు ఇక్కడి నుంచే పూలు కొనుగోలు చేసి ప్రజలు తీసుకువెళ్లేది. 20 గుంటల విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన గులాబీ తోట గ్రామీణుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. చూడముచ్చటగా ఉన్న రోజ్ గార్డెన్‌ను బెల్లంపల్లి పురప్రజలతో పాటు గ్రామీణులు కూడా సందర్శించి వెళ్లేవారు. ప్రత్యేకించి విద్యార్థులకు ఆటవిడుపుగా ఉపయోగపడిన ఉద్యానవన కేంద్రం అప్పటి ఐటీడీఏ ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరితో వైభవాన్ని కోల్పోయి నిర్జీవంగా తయారైంది. బెల్లంపల్లి పరిసర ప్రాంతాల రైతులకు ప్రత్యేకించి గిరిజనులు, ఔత్సాహికులకు తోటల పెంపకంపై శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలనే సదుద్దేశంతో దాదాపు 18ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మామిడి, జామ, సపోట, అల్లనేరేడు, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, పనస, ఉసిరి తదితర రకాల పండ్ల మొక్కల పెంపకం చేశారు. ఫలసాయాన్ని ఇచ్చే దశకు చేరుకోగానే అధికారుల పట్టింపు లేనితనంతో పండ్ల చెట్లకు చీడపీడలు, తెగుళ్లు, సగానికిపైగా పండ్ల తోటలు పనికి రాకుండా పోయాయి. ఈక్రమంలో ఇటీవల కొత్తగా వచ్చిన ఐటీడీఏ అధికారులు ఉద్యానవన కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రోజ్ గార్డెన్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. డ్రిప్ సౌకర్యం కల్పించి గులాబీ మొక్కలు పెంచుతున్నారు. మల్చింగ్ విధానంలో మొక్కల పెంపకం జరుగుతుండటంతో ప్రస్తుతం అందరి దృష్టి ఐటీడీఏ ఉద్యానవన కేంద్రంపై పడింది. గులాబీ తోట కాస్తా వృద్ధిలోకి రాగానే ఉద్యానవన కేంద్రంలో పండ్ల మొక్కలు పెంచడానికి చర్యలు తీసుకోనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రోజ్‌గార్డెన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో ఉద్యానవనానికి కళ వచ్చేసింది.

31వరకు ఓటు నమోదుకు అవకాశం

బెల్లంపల్లి: 18 ఏళ్లు నిండినవారంతా ఈ నెల 31వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ బీ రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళాకారులతో గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి బజారు ఏరియా జెడ్పీ హైస్కూల్‌లో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చడానికి స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఎన్నికల్లో అవకతవకలు, అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడుతూ.. డబ్బులు, మద్యం పంచుతూ.. ఉంటే లైవ్ ఫొటో, వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఆ ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేయండి'

- సీఎం వ్యాఖ్యల ఆధారంగా కోర్టులో పిటిషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దళితబంధులో కొందరు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని సీఎం కేసీఆర్ గత ఏప్రిల్‌లో బీఆర్ఎస్ సమావేశంలో చెప్పిన వ్యాఖ్యల ఆధారంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన ఆమ్ ఆద్మీ నాయకుడు నయీం పాషా మంచిర్యాల ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో కేసు వేశారు. అవినీతి నిరోధక చట్టం, ప్రజా ఆస్తి దుర్వినియోగం, రెవెన్యూ రికవరీ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టాల కింద ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయాలని కోర్టు దృష్టికి తెచ్చారు. మంగళవారం ఈ కేసు విచారణ చేపట్టేందుకు జడ్జి ఉపనిషధ్వని దళితబంధు పథకంలో బాధితులు ఎవరైనా ఉంటే కోర్టు ముందు ప్రవేశపెట్టాలని సూచించారు. వచ్చే నెల 29న తదుపరి ఈ కేసు విచారణ చేస్తామని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పిటిషనర్ ఆ మేరకు ఆధారాలు తీసుకుంటానని కోర్టుకు నివేదించినట్లు తెలిపారు. 'సీఎం కేసీఆర్ కొందరు ఎమ్మెల్యేలు దళితబంధులో అక్రమాలకు పాల్పడ్డారని స్వయంగా వెల్లడించారు. ఆ మాటలు దినపత్రికలు, టీవీ చానళ్లలో వచ్చింది. దీనిపై అవినీతి నిరోధకశాఖ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. దీంతో కోర్టులో కేసు వేశాను' అని నయీంపాషా 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో ఎవరైనా దళితబంధు లబ్ధిదారులు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు డబ్బులు ఇస్తే తెలుసుకుని కోర్టు ముందు ప్రవేశపెడతానని చెప్పారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాబాపూర్‌కు చెందిన పున్నెపురెడ్డి బాబాజీ (50) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం నొప్పి అధికం కావడంతో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల ఉదారత



యువతిని అప్పగిస్తున్న సీఐ రాజు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని కాలేజ్‌రోడ్‌లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ యువతిని గమనించిన స్థానికులు 100కు సమాచారం అందించారు. సీఐ రాజు, ఎస్సై రాజేందర్ యువతికి స్థానిక కల్వరి యువశక్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యువతి తండ్రి సర్వర్ గుర్తించి మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఆధారాలు చూపించడంతో యువతిని అప్పగించారు.



బెంగాలీలే నిర్ణేతలు!

- సిర్పూర్‌లో వారే కీలకం
- నియోజకవర్గంలో 20 వేల మంది ఓటర్లు
- 17 గ్రామాల్లో జీవనం

చింతలమానెపల్లి: మిగతా వాటితో పోలిస్తే సిర్పూర్ నియోజకవర్గం భిన్నత్వాన్ని కలిగి ఉంది. మినీ ఇండియాగా స్థానికులు పిలుచుకునే ఈ నియోజకవర్గంలో భిన్న ప్రాంతాల ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా శాశ్వతంగా నియోజకవర్గంలో కలిసిపోయారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినా నియోజకవర్గ రాజకీయ ఫలితాలపై ప్రభావం చూపగలిగే బెంగాలీలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు.

శరణార్థులుగా వచ్చినా..

1965లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో ఉన్న హిందువులు భారతదేశంలోకి రావాలని అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. సుమారు 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగ్లాదేశ్‌లోని ఫరీదాబాద్, కుల్నా, జాసోర్ జిల్లాల నుండి కాగజ్‌నగర్ ప్రాంతానికి హిందువులు తరలివచ్చారు. మొదట్లో శరణార్థులుగా వచ్చినా భారత ప్రభుత్వం వీరికి భారత పౌరసత్వం అందించి అన్నిరకాల వసతులు కల్పించింది.

ప్రత్యేక జీవన విధానం

స్థానికులతో పోలిస్తే బెంగాలీల జీవన విధానం కొంత భిన్నంగా ఉంటుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే బెంగాలీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. సంప్రదాయ పంటలు, వంటకాలను స్థానిక ప్రజలకు పరిచయం చేశారు. ఆధునికతకు పెద్దపీట వేస్తారు. హిందూ సంప్రదాయ పండుగలను పాటించే వీరికి దేశభక్తి కూడా ఎక్కువే. ఈజ్‌గాం, రవీంద్రనగర్ గ్రామాల నుంచి సుమారుగా 250 మందికి పైగా దేశసేవలో వివిధ హోదాలలో సైనికులుగా పనిచేస్తున్నారు. అన్నిరంగాల్లో రాణిస్తున్న బెంగాలీలు రాజకీయంగా చైతన్యం కలిగి ఉంటారు.

రాజకీయాలలో బెంగాలీలు

భారత స్వాతంత్ర్య పోరాటంలో తమదైన ముద్రవేసిన బెంగాలీలు రాజకీయంగా తమ ఆలోచనలను పంచుకుంటున్నారు. ఈజ్‌గాం నుంచి దేశస్థాయిలో పలు ఉద్యమాలు, కార్మిక పోరాట సంఘాలలో ప్రాతినిధ్యం వహించారు. నియోజవర్గ స్థాయిలో నాయకత్వం వహిస్తున్నారు. ఆయా రాజకీయ పార్టీలకు బెంగాలీల నాయకత్వం ఆవశ్యకత ఏటా పెరుగుతోంది. ఐకమత్యాన్ని చాటే బెంగాలీల ఓట్లు ఒకే పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఆయా పార్టీలు ఆశాభావం వ్యక్తం చేయడం వీరి ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

డిమాండ్లు..

తమకు కుల గుర్తింపు కల్పించాలనేది బెంగాలీల ప్రధాన డిమాండ్. రాబోయే ఎన్నికల్లో స్థానిక పార్టీలతో పాటు జాతీయ పార్టీలు పోటీ పడుతుండగా వీరి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు, చేపల పెంపకానికి నీటి సరఫరా అందించాలని, గ్రామాల్లో బెంగాలీ భాషా బోధన చేయాలని, బెంగాలీలను ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

17 గ్రామాలు.. 20 వేల ఓటర్లు

1965లో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి కాగజ్‌నగర్ శివారు ప్రాంతంలో ప్రభుత్వం శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈజ్‌గాం వద్ద నజ్రుల్‌నగర్, తదితర గ్రామాల పేరుతో మొత్తం 14 క్యాంపులు (శిబిరాలు) ఏర్పాటు చేసింది. అనంతరం 1976లో అప్పటి కౌటాల మండలంలోని బాబాపూర్ శివారులో రవీంద్రనగర్ పేరుతో రెండు గ్రామాలు, సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ వద్ద మరో గ్రామం ఏర్పాటు చేసింది. ఉపాధి కోసం కుటుంబానికి ఐదెకరాల వ్యవసాయభూమి, 8 గుంటల నివాసస్థలం ఇచ్చింది. ఏడాదిపాటు రేషన్, ఇతర వస్తువులను ఉచితంగా సరఫరా చేసింది. మొత్తం 17 గ్రామాల్లో సుమారు 26 వేల జనాభా, 20 వేల ఓటర్లు ఉన్నారు. నజ్రుల్‌నగర్ పరిధిలోని 14 గ్రామాల్లో 13,500, రవీంద్రనగర్‌లో 2,500, లక్ష్మీపూర్‌లో 600, మిగతావారు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్నారు.

కుల గుర్తింపు కోసం పోరాటం

బెంగాలీలుగా ఉన్న వీరికి ఆయా కులాల అనుసారంగా గతంలో ప్రభుత్వం కుల ధృవీకరణ పత్రాలను అందజేసినా ఆతర్వాత నిలిపి వేసింది. గతంలో రవీంద్రనగర్ సర్పంచ్‌గా పనిచేసిన పలువురు ఎస్సీ ధృవీకరణ పత్రాలతో గెలుపొందారు. పదేళ్ల క్రితం స్థానిక సంస్థల ఎన్నికల్లో రవీంద్రనగర్ ఎంపీటీసీ స్థానాన్ని బీసీలకు కేటాయించగా గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. స్థానికేతరులు సైతం పాల్గొనకుండా బెంగాలీలకు మద్దతు తెలిపారు. ఆర్మీలో సైనికులుగా పనిచేస్తున్న యువకులు తమకు కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు విద్యాపరమైన హక్కులను కోల్పోతున్నారు. దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి తమ సమస్యను విన్నవించారు. అన్ని పార్టీలు వీరికి మద్దతు తెలియజేస్తున్నా సమస్యకు పరిష్కారం మాత్రం లభించడం లేదు.

సాగునీరు అందించాలి



వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్నాం. సాధారణ పంటలతో పాటు, కూరగాయలు, కొన్ని రకాల ప్రత్యేక పంటలు పండిస్తున్నాం. చేపల పెంపకం కూడా చేపడుతున్నాం. వీటికి సాగునీరు అత్యంత అవసరం. స్థానికంగా పథకాలను ఏర్పాటు చేసి సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– సుశీల్ మండల్, సర్పంచ్, రవీంద్రనగర్

బెంగాలీ భాష బోధించాలి



మా సంస్కృతిని కాపాడుకోవాలంటే బెంగాలీ భాషను మర్చిపోకుండా ఉండాలి. మాతృభాష అయిన బెంగాలీ మాధ్యమంగా పాఠశాలలను ఏర్పాటు చేయాలి. పదో తరగతి వరకు మాతృభాషగా బెంగాలీ భాషను బోధించాలి. బెంగాలీ గ్రామాల పాఠశాలల్లో బెంగాలీ ఉపాధ్యాయులను నియమించాలి.

– సమీర్ గుప్తా, ఉపసర్పంచ్, నజ్రుల్‌నగర్

ఏ-ఫారం, బీ-ఫారం అంటే?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల సమయంలో తరచూ ఏ-ఫారం, బీ-ఫారం పేర్లు వింటుంటాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులు అభ్యర్థులకు రావాలంటే వీటి అవసరం ఉంటుంది. అవేమిటో?.. ఎలా ఇస్తారో? తెలుసుకుందాం.

ఏ-ఫారం అంటే...

పార్టీ తన అభ్యర్థిగా ఎవరినైతే ఎంపిక చేస్తుందో వారికి బీ-ఫారం అందజేస్తారు. బీ-ఫారం అందించే వ్యక్తికి ముందుగా ఇచ్చేది 'ఏ' ఫారం. పార్టీ ఎవరిని ఎంపిక చేసి ఏ-ఫారం అందిస్తుందో వారికి మాత్రమే బీ-ఫారం అందిస్తారు. ఏ-ఫారం అందుకున్న పార్టీ అభ్యర్థి ఎన్నికల అధికారులకు అందజేస్తారు.

బీ-ఫారం అంటే...

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని గుర్తించేలా ఇచ్చేదే బీ-ఫారం. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియామకమైన ప్రతినిధులు ఈ బీ-ఫారం అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారం దాఖలు చేస్తేనే సదరు అభ్యర్థికి పార్టీకి సంబంధించి ఎన్నికల గుర్తు కేటాయిస్తారు.

లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల ..



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్న సమయంలో 1952లో లక్సెట్టిపేట నియోజకవర్గం ఏర్పాటు జరిగింది. 2004 వరకు అదేపేరుతో కొనసాగింది. మొదటి ఎమ్మెల్యేలుగా విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు 1952 నుంచి 57 వరకు సోషలిస్టు పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. చివరి ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావు ప్రాతినిధ్యం వహించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో లక్సెట్టిపేట నియోజకవర్గం 'మంచిర్యాల నియోజకవర్గం'గా మారింది. మంచిర్యాల నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి ఎన్నికయ్యారు.

కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

జైపూర్: సింగరేణి కార్మికులకు రావాల్సిన 32శాతం లాభాల వాటాను వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు లాభాల వాటా ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ నెపంతో కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తుందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. సింగరేణి ఎన్నికల్లో సైతం బీఎంఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని, రాబోయే రోజుల్లో సింగరేణి కార్మిక సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, నాయకులు కాసెట్టి నాగేశ్వర్‌రావు, వినోద్, రమేశ్, సదానందం, మొగిలి, రాజు, రాయమల్లు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థి పీఎస్సార్ మా ప్లాట్లు ఆక్రమించాడు..

- ప్లాట్లలోకి రాకుండా అడ్డుకుంటున్నాడు..
- న్యాయం జరుగకపోతే మూకుమ్మడి ఆత్మహత్యలే శరణ్యం
- ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ సభ్యుల ఆరోపణ



మాట్లాడుతున్న ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.గోపాల్‌రావు

కాచిగూడ: తాము 40ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ఇంటి స్థలాల ప్లాట్లను కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కే.ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) కబ్జా చేసి ప్లాట్ల వద్దకు వెళ్తే గూండాలతో చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ ప్రధానకార్యదర్శి జి.గోపాల్‌రావు, సొసైటీ ప్రతినిధులు కటారి ప్రమీల, రవీందర్‌రెడ్డి, ఎస్.అలీ అజ్గర్, ఏఎస్ఆర్‌కే ప్రసాద్, సుజాత ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కాప్రా పరిధిలోని వంపుగూడలో 62 ఏకరాల్లో 706 ప్లాట్లను ఒక్కో ప్లాట్ 300 గజాల చొప్పున 40ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని తెలిపారు. గత 20ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కే.ప్రేమ్‌సాగర్‌రావు 706 ప్లాట్లలో 100 ప్లాట్లను తీసుకుని మిగతా 606 ప్లాట్ల ఓనర్లను తమ స్వంత ప్లాట్లలోకి రాకుండా గూండాలను పెట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్లాట్లలో ఇళ్లు కట్టుకుంటే, ఇంటి స్థలాల చుట్టూ కాంపౌండ్ కట్టుకుంటే ప్రేమ్‌సాగర్‌రావు కూల్చివేశారని అన్నారు. ప్రస్తుతం ఒక్కో ప్లాట్ ఖరీదు రూ.50 లక్షల వరకు ఉంటే తనకు రూ.7, 8 లక్షలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేదంటే ప్లాట్లలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, ఇప్పటికే చాలామంది ప్లాట్ల ఓనర్లపై దాడులు చేయించాడన్నారు. ఇప్పుడు వృద్ధాప్యంతో ప్రేమ్‌సాగర్‌తో పోరాడే శక్తి లేదని, ప్రభుత్వమే న్యాయం జరిగేలా చూడాలని, లేదంటే మూకుమ్మడిగా ఆత్మహత్యలే శరణ్యమని వారు తెలిపారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించి తమ ప్లాట్లు తమకు ఇప్పించాలని వారు కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాల్క సుమన్

భీమారం: మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు మంగళవారం ఆపార్టీకి రాజీనామా చేసి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ భరత్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంకణాల సుధాకర్‌రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఆవిడపు సురేష్, సెగ్యం మల్లేశ్, గుడిమల్ల బాపుతో పాటు 20 మంది పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'వర్క్ టూ రూల్ పాటించాలి'

శ్రీరాంపూర్: కార్మికులకు లాభాల వాటా నిలిపివేసినందుకు నిరసనగా ఉద్యోగులు వర్క్‌టూ రూల్ పాటించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు రి యాజ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను నిలిపివేయడం అన్యాయమన్నారు. దీనిని నిరసిస్తూ ప్రతిరోజు ఉద్యోగులు విధుల్లో గంటసేపు వర్క్ టూ రూల్, ఆఫీస్ సిబ్బంది పెన్‌డౌన్ చేపట్టాలన్నారు. యా జమాన్యం ఇప్పటికైనా జాప్యం చేయకుండా లాభాల వాటాను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

దసరాకు ముందే లాభాల వాటా చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

రామకృష్ణాపూర్: ముందుగా ప్రకటించిన విధంగా దసరాకు ముందే సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరిట లాభాల వాటా చెల్లించకుండా ఉండటం సరికాదన్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ రాకముందే 32 శాతం వాటా ఈ నెల 16నే చెల్లిస్తామని యాజమాన్యం ఈ నెల 4న సర్క్యులర్ జారీ చేసిందన్నారు. జీతాలు, లాభాల్లో వాటా, బోనస్ ఆపే హక్కు ఏ ఎన్నికల కోడ్‌కు కూడా ఉండదన్నారు. పండగకు ముందే లాభాల వాటా చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 20న సింగరేణి హెడ్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ యాజమాన్యం దిగిరాకపోతే 21న సమ్మెలోకి దిగుతామని స్పష్టం చేశారు. సమావేశంలో యూనియన్ కేంద్రకమిటీ కార్యదర్శి అక్బర్‌అలీ, నాయకులు అంజనేయులు, సురమల్ల వినయ్, లింగయ్య, హరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

21లోగా ఉద్యోగుల ఖాతాల్లో లాభాల వాటా?

మందమర్రిరూరల్: ఈ నెల 21లోగా సింగరేణి కార్మికుల బ్యాంకు ఖాతాల్లో లాభాల వాటా డబ్బులు జమ అవుతాయని సంస్థ ఇన్‌చార్జి సీఎండీ, ఇంధనశాఖ కార్యదర్శి సుశీల్‌శర్మ హామీ ఇచ్చినట్లు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో సుశీల్‌శర్మను కలిసి ఎన్నికల కోడ్‌కు సంబంధం లేకుండా ఉద్యోగులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి శనివారంలోగా చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

వరండాలోనే జ్వర బాధితురాలు

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన గుడికందుల బాలమ్మ తన కుమార్తె కీర్తనకు జ్వరం రావడంతో మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చింది. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆస్పత్రి వరండాలోనే బెంచీపైన బిడ్డను పడుకోబెట్టుకుని రోదించింది. దూరం నుంచి వచ్చిన తమలాంటి వారిని పట్టించుకోవడంలేదని వాపోయింది. ఆస్పత్రిలో పడకలు సరిపోకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



ఆస్పత్రి వరండాలో జ్వర బాధితురాలు

వేర్వేరు చోట్ల భారీగా నగదు పట్టివేత

- బెల్లంపల్లిలో రూ.5.94 లక్షలు..

బెల్లంపల్లి: పట్టణంలోని పలుచోట్ల మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.5.94 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మందమర్రి యాపల్ ఏరియాకు చెందిన బొడ్డున రమేశ్ వద్ద రూ.1.24 లక్షలు, బెల్లంపల్లికి చెందిన బండి మల్లేశ్ వద్ద రూ. 2.50 లక్షలు, టి.సూర్యకుమార్ వద్ద రూ.1.50లక్షలు, తాండూర్ ఐబీకి చెందిన షేక్‌యాజ్‌వద్ద రూ.70 వేలు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ టీమ్ అధికారి ఎల్తూరి సురేఖకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

మంచిర్యాలలో రూ.1.73 లక్షలు..

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన అక్కొండ యుగెందర్ వద్ద రూ.1.73 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజు తెలిపారు. రామసుధ లాడ్జి వద్ద జరిపిన తనిఖీల్లో పట్టుబడిన నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ హన్మంతరెడ్డికి అప్పగించినట్లు తెలిపారు.

వాంకిడిలో రూ.లక్ష..

వాంకిడి: పట్టణంలోని జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1,02,320 నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ఇన్‌చార్జి వైరగడే ఆత్మరాం నగదుతో ఆసిఫాబాద్ వెళ్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.



ఎఫ్ఎస్‌టీ అధికారికి నగదు అప్పగిస్తున్న ఎస్సై

దహెగాంలో రూ.63,500

దహెగాం: మండలంలోని పార్వతిపేట సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోత్మీర్ గ్రామానికి చెందిన బుర్ర సత్తయ్య వద్ద రూ.63,500 నగదు పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మంచిర్యాలలో రూ.1.75 లక్షలు..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఒకరి వద్ద రూ.1.75 లక్షల నగదు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, సీఐ రాజు, ఎస్సై రాజేందర్ నగదును సీజ్ చేశారు.

తాళ్లగురిజాలలో రూ.2 లక్షలు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మాలగురిజాలకు చెందిన శ్రీనివాస్ రూ.2 లక్షలతో బెల్లంపల్లికి ఆటోలో వెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సురేఖకు అందజేశారు. తనిఖీల్లో ఏఎస్సైలు లింగన్న, రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.